ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
గురువారం 9 అక్టోబరు 2025

ఎన్టీపీసీలో పర్యటించిన సీఐఎస్ఎఫ్ డీఐజీ

జ్యోతినగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఐఎస్ఎఫ్ దక్షిణ రీజియన్ డీఐజీ రాఘవేంద్రకుమార్ బుధవారం రామగుండం ఎన్టీపీసీలో పర్యటించారు. రెండురోజుల పర్యటనలో భాగంగా ఇక్కడికి వచ్చిన ఆయనకు స్థానిక అధికారులు ఘన స్వాగతం పలుకగా, రామగుండం యూనిట్ జవానులు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం రాఘవేంద్రకుమార్ రామగుండం ప్రాజెక్టుతోపాటు తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టులు పర్యటించారు. ఎన్టిపిసీ ప్రాజెక్టు భద్రతకు సంబంధించి డీఐజీ సంబంధిత అధికారులు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ కమాండెంట్ అరవింద్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడి.. రాజ్యాంగంపై దాడి చేసినట్లే

● సీపీఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి పాల్పడడం.. రాజ్యాంగంపై దాడి చేసినట్లే అని.. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ జిల్లాకార్యదర్శి తాండ్ర సదానందం పేర్కొన్నారు. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై జరిగిన దాడికి నిరసనగా జిల్లాకేంద్రంలోని బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం సదానందం మాట్లాడుతూ దాడికి పాల్పడిన వ్యక్తిపై దేశద్రోహం కేసు నమోదుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మార్కపురి సూర్య, కౌన్సిల్‌సభ్యుడు ఆరేపల్లి మానస్‌కుమార్, రేణిగుంట్ల ప్రీతం, కల్లేపల్లి నవీన్ నాయకులు మాచర్ల అంజి, కల్లేపల్లి శంకర్, కల్లేపల్లి రవి, బొంకూరి ఎల్లయ్య, జోగుల రామస్వామి, సాయి ఆజాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు



ఖని బస్టాండ్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సెలవులు ముగియడంతో పట్టణాలకు వెళ్లే ప్రయాణికుల పడిగాపులతో గోదావరిఖని బస్టాండ్ బుధవారం కిటకిటలాడింది. బస్సులు లేక ప్రయాణికులు చాలా ఇబ్బంది పడ్డారు. వచ్చిన బస్సుల్లో సీట్ల కోసం కుస్తీపడ్డారు. గోదావరిఖని, రాజేష్ టాకీస్, రాంమందిర్ ఏరియా, ఫైవింక్లైయిన్ ఏరియాలో బస్సులు ప్రయా ణికులతో నిండిపోయాయి. సరిపడినన్ని బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మంత్రి పొన్నం క్షమాపణను స్వాగతిస్తున్నాం



ఖనిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

కోల్‌సిటీటౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ దివ్యాంగులశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌పై కులవివక్షతో చేసిన అనుచిత వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ క్షమాపణ చెప్పడాన్ని ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం స్వాగతిస్తోందని తెలిపింది. బుధవారం గోదావరిఖనిలోని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి దళిత అణగారినవర్గాల బహుజనుల ఐక్యతగా భావిస్తున్నట్టు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలిండియా అంబేద్కర్ యువజనసంఘం నాయకులు బొంకూరి మధు, మైసరాజేష్, కాంపెల్లి సతీష్, కొంకటి లక్ష్మణ్, బాలంకూస్, గద్దల శశిభూషన్, మిట్టపల్లి రాజేందర్‌కుమార్, పంజా అశోక్, పెరిక రవి, శామిల్,అంబాలరాజ్‌కుమార్,బూడిదమహేందర్,కొంకటిసిద్ధార్థ పాల్గొన్నారు.

రిజర్వేషన్ మార్చి.. అవకాశం కల్పించాలి

ధర్మారం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖిలావనపర్తి గ్రామంలోని ఎస్సీలంతా తమ గ్రామ రిజర్వేషన్ మార్చి తమకు స్థానిక ఎన్నికల్లో అవకాశం కల్పించాలని బుధవారం కలెక్టర్ కోయ శ్రీహర్షకు వినతిపత్రం సమర్పించారు. 2011జనాభా లెక్కల్లో ఓ అధికారి గ్రామంలో 400 ఎస్సీ జనాభాకు నలుగురు ఉన్నట్లుగా తప్పుగా నమోదు చేశాడన్నారు. తద్వారా 15సంవత్సరాలుగా రిజర్వేషన్ ఫలాలు అందక ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటూ నష్టపోతున్నామని తెలిపారు. ప్రస్తుతం గ్రామంలో 5వందల పైచిలుకు ఎస్సీ జనాభా ఉందన్నారు. ఈసారి కూడా 2011జనాభా లెక్కల ప్రాతిపదికనే ఎన్నికలు నిర్వహిస్తుండడంతో గ్రామంలోని ఎస్సీలు పోటీలో ఉండే అవకాశం లేకుండా పోయింది. ఇదే విషయాన్ని గ్రామంలోని ఎస్సీలంతా సంతకాలతోకూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఖిలావనపర్తి గ్రామాన్ని ఈసారిఎన్నికల్లో ఎస్సీలకు కేటాయించాలని కోరారు.

● 74షాపులకు
● గతనెల 26న నోటిఫికేషన్
● 13రోజుల్లో 21దరఖాస్తుల రాక
● పెద్దగా ప్రచారం నిర్వహించని ఎక్సైజ్‌శాఖ

మద్యం టెండర్లపై.. 'స్థానిక' ఎఫెక్ట్



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో గల రిటెయిల్ మద్యం షాపుల టెండర్లపై స్థానిక ఎన్నికల ప్రభావం పడింది. షాపులకు టెండర్లు దాఖలు చేసేందుకు గడిచిన నెల 26వ తేదీన నోటిఫికేషన్ వెలువడగా, పదమూడు రోజుల్లో కేవలం 21 దరఖాస్తులు మాత్రమే రావడంతో ఎక్సైజ్ అధికారుల్లో ఆందోళన మొద లయ్యింది. సంబంధిత అధికారులు దసరా అమ్మకాలపై దృష్టి సారించి మద్యం షాపుల టెండర్లపై విస్తృత ప్రచారం నిర్వహించకపోవడం, దరఖాస్తు ఫారం ధర 3లక్షలకు పెంచడం, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన కారణంగా టెండర్లు దాఖలుకు స్పందన కరువైనట్లు కనబడుతున్నది. ప్రధానంగా మద్యం షాపుల కోసం ఎక్కువ మంది ఆయా రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు మాత్రమే టెండర్లు దాఖలు చేస్తారు. వారంతా స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి సారించారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు తీర్పు ఎలా ఉంటుందనే ఉత్కంఠ నెలకొన్నది. బుధవారం హైకోర్టులో వాదనలు విన్న ధర్మాసనం, గురువారం మధ్యాహ్నం 2:30గంటలకు విచారణ వాయిదా వేసింది. అయితే అదేరోజున జడ్పీటీసీ, ఎంపీటీసీ మొదటి విడత ఎన్నికల నోటిఫికేషన్ జారీ కావాల్సి ఉంది. బీసీ రిజర్వేషన్లకుఅనుకూలంగా తీర్పు వెలువడితే మాత్రం షెడ్యూల్ ప్రకా రం ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేప థ్యంలో దరఖాస్తుదారులు మద్యం షాపుల టెండర్లపై ఆసక్తి చూపడం లేదు.

● స్థానిక ఎన్నికల ప్రభావమే ఎక్కువ..

మద్యం షాపుల కోసం టెండర్లు దాఖలు చేసేందుకు స్పందన కరువు కావడానికి స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో పాటు దరఖాస్తు ఫారం ధరను అదనంగా లక్ష పెంచడమే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. 2023లో నిర్వహించిన టెండర్ల ద్వారా 77షాపులకు 2022 దరఖాస్తులు రాగా, 40 కోట్ల 44 లక్షల రూపాయల ఆదాయం వచ్చింది. కానీ ప్రస్తుత పరిస్థితిని చూస్తే, దరఖాస్తు ధరలు పెంచినా కూడా ఆ మేరకు ఆదాయం వచ్చే అవకాశాలు లేవు. కేవలం మద్యం షాపుల మీదనే ఆధారపడే వ్యాపారులు తప్పకుండా టెండర్లలో పాల్గొంటారు. కొత్తగా షాపులపై ఆసక్తిచూపే వాళ్లు తక్కువగా కనబడుతున్నారు. బీసీ రిజర్వేషన్లకు అనుకూలంగా కోర్టు తీర్పు అనుకూలంగా వస్తే మాత్రం షెడ్యూల్ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఎన్నికల్లో రాజకీయ నాయకులు మునిగితేలనున్నారు. ఈ ఎన్నికల నేపథ్యంలో పోటీ చేయాలనుకుంటున్న

(మిగతా 8వ పేజీలో)

● 74 షాపులకు 21 దరఖాస్తులు..

జిల్లాలో 74మద్యం రిటెయిల్ షాపులు ఉన్నాయి. ఈసారి మూడు షాపులు తగ్గాయి. గౌడ కులస్తులకు 15శాతం, ఎస్సీలకు 10శాతం, ఎస్టీలకు 5శాతం మద్యం షాపులను కేటాయించాల్సి ఉంది. ఆ మేరకు గౌడ కులస్తులకు 13షాపులు, ఎస్సీలకు 8షాపులు, మొత్తం 21షాపులను కేటాయించారు. మిగతా 53షాపులు జనరల్‌కు కేటాయించారు. పెద్దపల్లి ఎక్సైజ్‌సర్కిల్ పరిధిలో 20షాపులు ఉండగా, ఇప్పటివరకు 6 దరఖాస్తులు, సుల్తానాబాద్ ఎక్సైజ్‌సర్కిల్ పరిధిలో 15షాపులు ఉండగా, 4 దరఖాస్తులు, రామగుండం ఎక్సైజ్‌సర్కిల్ పరిధిలో 24షాపులు ఉండగా, 3 దరఖాస్తులు, మంథని ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 15షాపులు ఉండగా, 8 దరఖాస్తులు వచ్చాయి. 13 రోజుల్లో 21 దరఖాస్తులు వచ్చాయి. ఈనెల 18వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించేందుకు గడువు విధించారు. మద్యం షాపులను దక్కించుకునే నిర్వాహకులు డిసెంబర్ 1వ తేదీ నుంచి 2027 నవంబర్ 30వ తేదీ వరకు వాటిని నిర్వహించాల్సి ఉంటుంది.

నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

పెద్దపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమీషనర్ రాణి కుముదిని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై బుధవారం సాయంత్రం ఆమె అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి మొదటివిడత ఎన్నికల నోటిఫికేషన్ అక్టోబర్ 9నఉదయం 10:30గంటల వరకు విడుదల చేయాలని అన్నారు. నోటిఫికేషన్ జారీ చేయడంతోపాటు ఎంపీటీసీ జడ్పీటీసీ పరిధిలోని ఓటరుజాబితా వివరా లను ప్రచురించాలని అన్నారు. అక్టోబర్9 నుంచి అక్టోబర్11 వరకు ప్రతిరోజు ఉదయం 10:30నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరించాలని అన్నారు. నామినేషన్ల పరిశీలన అక్టోబర్ 12న సాయంత్రం 5గంటల వరకు పూర్తిచేసి చెల్లుబాటైన నామినేటెడ్ అభ్యర్థుల జాబితాను ప్రకటించాలని అన్నారు. అభ్యర్థుల జాబితాపై అప్పీల్ కోసం అక్టోబర్13 సాయంత్రం 5గంటల వరకు గడువు ఉంటుందని, అక్టోబర్14న అప్పీళ్ల పరిష్కరించాలని, నామినేషన్ల ఉపసంహరణకు అక్టోబర్15 మధ్యాహ్నం 3గంటల వరకు గడువు ఉంటుందని అన్నారు. అదే రోజు పోటీచేసే అభ్యర్థుల జాబితా ప్రచురించాలని అన్నారు. అనంతరం, గుర్తులు కేటాయించాలన్నారు. జిల్లాకలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మొదటివిడతలో పెద్దపల్లి జిల్లాలో 68 ఎంపీటీసీ, 7జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. రిటర్నింగ్ అధికారులకు, ఇతర సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇచ్చామన్నారు. జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టామని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీసీపీ కరుణాకర్, అదనపుకలెక్టర్ అరుణశ్రీ, జడ్పీ సీఈవో నరేందర్, డీపీవో వీర బుచ్చయ్య, ఆర్డీవోలు గంగయ్య, సురేష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వం స్కూల్ ఫీజు చెల్లించాలి

● బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులు తల్లిదండ్రుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 8 (ఆంధ్ర జ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కూళ్లలో చదివే విద్యార్థులు వారి తల్లిదండ్రులతో కలిసి బుధవారం పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట బైఠాయించి రాస్తారోకో చేశారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్‌ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణమే పెండింగ్ బకాయిలు చెల్లించాలని నినాదాలు చేశారు. రాస్తారోకోతో రాజీవ్ రహదారిపై రాకపోకలు స్తంభించిపోయాయి. సమాచారం అందుకున్న పెద్దపల్లి పట్టణ ఎస్ఐ లక్ష్మణ్‌రావు పోలీస్‌సిబ్బందితో అక్కడికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించి రాస్తారోకో విరమింపజేశారు. దీంతో రాకపోకలు యథావిధిగా కొనసాగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో తమ పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు తమ పిల్లలను పాఠశాలకు రానివ్వడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బెస్ట్ అవైలబుల్ స్కూల్ ఫీజులు చెల్లించి తమపిల్లల భవిష్యత్తును కాపాడాలని విజ్ఞప్తి చేశారు. వీరి ఆందోళనకు విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు మద్దతు పలికారు. ఆందోళనలో సంఘాల నాయకులు బాలసాని లెనిన్, స్టాలిన్, సీపెల్లి రవీందర్, మోదుంపల్లి శ్రావణ్, కల్లేపల్లి అశోక్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలపై మక్కువ పెంచుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి మాధవి

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): చదువుతోపాటు క్రీడలపై విద్యార్థులు మక్కువ పెంచుకోవాలని జిల్లావిద్యాధికారి మాధవి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 69వజిల్లాస్థాయి ఎస్‌జీఎఫ్ అథ్లెటిక్స్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతోనే విద్యార్థులకు పూర్తి పరిపక్వత లభిస్తుందని, ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమంగా స్వీకరించాలని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో అక్కపాక సురేష్, జిల్లాఎస్‌జీఎఫ్ కార్యదర్శి లక్ష్మణ్, పెటాఅధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సురేందర్, దాసరి రమేష్, జిల్లా ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్, ప్రిన్సిపాళ్ల రవీందర్‌రెడ్డి, పరశురాం, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదిగలను అవమానించిన మంత్రిని తొలగించాలి



రాస్తారోకో చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పెద్దపల్లిటౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) మాదిగల ఆత్మగౌరవాన్ని అవహేళన చేసిన మంత్రి పొన్నంప్రభాకర్ మాదిగలకు వెంటనే క్షమాపణ చెప్పాలని మంత్రిపదవి నుంచి తొలగించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోనీ కమాన్‌చౌరస్తాలో రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేపట్టి పొన్నం ప్రభాకర్ దిష్టిబొమ్మను దహనంచేసే క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. అనంతరంవారు మాట్లాడుతూ మాదిగలకు క్షమాపణ చెప్పాలని లేనియెడల మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మరింత ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో ఎమార్పీఎస్ జిల్లాఅధ్యక్షుడు అంబాల రాజేందర్, చందు, అంబాల నరేష్, పెరికసాగర్, కుక్కఅశోక్, పల్లె సదానందం, బొంకూరి నరేందర్, కుక్క శ్రీనాథ్, శ్రావణ్ కుమార్, కుక్కవంశీ, ఆరేపల్లివంశీ పాల్గొన్నారు.

రిటైల్ మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ

సుల్తానాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిలాలోని రిటైల్ మద్యంషాపులకు దరఖాస్తులు స్వీకరిస్తామని సుల్తానాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గురునాథ్ రాథోడ్ ఒకప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, రామగుండం, మంథిని, ఎక్సైజ్‌స్టేషన్ల పరిధిలోగల74రిటైల్ మద్యం దుకాణాలకు టెండరు దరఖాస్తులను ఈనెల18వరకు స్వీకరిస్తామ న్నారు. ఆసక్తిగలవారు తమ దరఖాస్తులను పెద్దపల్లి జిల్లాకేంద్రంలో గల జిల్లా ప్రొహిబిషన్‌అండ్‌ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఈనెల23న ఉదయం 11గంటలకు బందంపల్లిలోని స్వరూప గార్డెన్‌లో డ్రా తీస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు ఆయాప్రాంతాల్లోని ఎక్సైజ్ అధికారులను సంప్రదించాలన్నారు.

ఆహ్లాదాన్ని పంచని ఎకో పార్క్ 8లో..

విశాలమైన రోడ్లు.. సెంట్రల్ లైటింగ్

● కొత్తరోడ్లతో సుల్తానాబాద్ పట్టణానికి శోభ
● రూ 2.50కోట్లతో పూర్తైన సీసీ రోడ్డు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్



సుల్తానాబాద్ పూసాల రోడ్డులో సెంట్రల్ లైటింగ్

సుల్తానాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ రోడ్లు నూతన కళ సంతరించుకున్నాయి. ఇరుకు రోడ్లతో, ట్రాఫిక్ రద్దీతో సతమతమైన పట్టణప్రజలు ప్రస్తుతం విశాలమైన రోడ్లను, సెంట్రల్‌లైటింగ్ అనుభూతిని పొందుతూ సంభ్రమాశ్చర్యాలకు లోనవుతున్నారు.

● పూసాల చౌరస్తాకు సెంట్రల్ లైటింగ్..

సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల చౌరస్తాకు సెంట్రల్ లైటింగ్ సిస్టం రావడంతో కొత్తకళ సంతరించుకుంది. రెండున్నర కోట్లతో కొత్తగా సీసీరోడ్లు నిర్మించారు. డివైడర్లు కూడా ఏర్పాటు చేశారు. పూసాల చెరువు కట్ట వరకు రోడ్డు నిర్మాణం పూర్తయింది. ఆ రోడ్డుపై డివైడర్ల మధ్యన ఇటీవల సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఏర్పాటు చేశారు. వారం కిందట ఈ సిస్టంను ఎమ్మెల్యే విజయరమణారావు ప్రారంభించారు. నూతనంగా మిణుకు మిణుకుమంటూ లైటింగ్ కనబడడంతో రోడ్డంతా నూతనశోభ ఏర్పడింది. దారిన వెలుతున్న వారు ప్రత్యేకించి చూస్తూ వెళుతున్నారు. వెంకటస్వామి విగ్రహం ముందు మున్సిపల్ ఆఫీసువరకు ఉన్న రోడ్డులో కూడా లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు. ఇలా పట్టణానికి కొత్త అందం చేకూరింది. ఇంకా ఐబీ చౌరస్తా నుంచి కోర్టు చౌరస్తా, అక్కడి నుంచి మండల పరిషత్, మజీద్ చౌరస్తాల మీదుగా గట్టేపల్లి రోడ్డు వరకు కూడా రోడ్డు విస్తరణ పనులు పూర్తైతే పట్టణ ప్రజల కష్టాలు తీరినట్టే.



విశాలంగా మారిన శివాలయం ఆవరణ

● విశాలంగా రోడ్లు..

పట్టణంలో ప్రధానమైన పాతజెండా చౌరస్తా నుంచి ట్యాంక్‌రోడ్డు ప్రస్తుతం డబుల్ రోడ్డుగా మారింది. అలాగే పాతజెండా నుంచి శంకరలింగం కిరాణం చౌరస్తా నుంచి శివాలయం వరకు కూడా డబుల్ రోడ్డు వేశారు. మున్సిపల్ ఆఫీసు చౌరస్తా నుంచి వేణుగోపాల స్వామిఆలయం, అక్కడ నుంచి పాతజెండా వరకు ఉన్న పాతరోడ్డును తొలగించి డబుల్ రోడ్డువేశారు. రోడ్లన్నీ విశాలంగా మారాయి. వాహనాల రాకపోకలకు అనుకూలంగా ఉన్నాయి.

అలంకారప్రాయంగా పల్లె దవాఖానాలు

- మూడేళ్లు కావస్తున్నా ప్రారంభానికి నోచుకోని వైనం..
- పట్టించుకోని అధికారులు

తంగళ్లపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పల్లె దవాఖానల నిర్మాణం పూర్తయి మూడేళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోకుండా అలంకారప్రాయంగా నిలుస్తున్నాయి. నేషనల్ హెల్త్ మిషన్ పథకంలో భాగంగా 2022లో తంగళ్లపల్లి మండలంలో 7 పల్లె దవాఖానల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. తంగళ్లపల్లి, నేరెళ్ల, లక్ష్మీపూర్, జిల్లెల్ల, తాడూరు, బస్వాపూర్, ఒబులాపూర్ గ్రామాల్లో ఒక్కో పల్లె దవాఖాన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు అయ్యాయి.

● నిర్మాణాలు పూర్తయి మూడేళ్లు..

తాడూరు, బస్వాపూర్ గ్రామాల్లో పల్లె దవాఖాన నిర్మాణాలు పూర్తిచేసుకుని మూడేళ్లు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోకుండా అలంకరప్రాయంగా నిలిచాయి. లక్ష్మీపూర్, జిల్లెల్ల, తంగళ్లపల్లి గ్రామాల్లో పల్లె దవాఖానల నిర్మాణం పూర్తి చేసుకుని అందుబాటులోకి వచ్చాయి. నేరెళ్ల, ఒబులాపూర్ గ్రామాల్లో బేస్‌మెంట్ దశలోనే నిర్మాణ పనులు నిలిచిపో యాయి. ఈ విషయంపై సంబంధిత అధికారులను ఫోన్‌లో సంప్రదించ డానికి ప్రయత్నించగా అందుబాటు లోకి రాలేదు.



తాడూరులో నిర్మాణం పూర్తి చేసుకున్న పల్లె దవాఖాన

● అద్దె ఇళ్లలోనే కొనసాగింపు..

మూడేళ్లుగా అద్దె ఇళ్లలోని ఇరుకు గదు ల్లో అరకొర వసతు లతో పల్లె దవాఖానాలు కొనసాగుతున్నాయి. మూడేళ్లుగా తాడురు, బస్వాపూర్ గ్రామాల్లో పల్లె దవఖానాలు నిర్మాణం పూర్తిచేసుకుని సిద్ధంగా ఉన్నా ప్రారంభానికి నోచుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో భవనాల నిర్మాణాల బిల్లులు కాంట్రాక్టర్లకు చెల్లించకపోవడంతో నిర్మాణం పూర్తయినా ప్రారంభించడంలో జాప్యం జరుగుతున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులు దృష్టి సారించి పల్లె దవాఖానలు అందుబాటులోకి వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


తాడూరులో అద్దె ఇంట్లో పల్లె దవాఖాన

గత ప్రభుత్వ హయాంలోనే నిర్మాణం పూర్తి చేశాను..

- వెంకటరెడ్డి, కాంట్రాక్టర్



గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మూడేళ్ల క్రితం భవనం నిర్మాణం పూర్తిచేశాను. అప్పటి ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం మారాక పల్లె దవాఖాన నిర్మాణం బిల్లులు చెల్లించాలని ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించాను. బిల్లులు త్వరగా చెల్లించి భవనం ప్రారంభించాలి. పల్లె దవాఖానల భవన నిర్మాణాల బిల్లులు చెల్లించేలా కలెక్టర్ చొరవ తీసుకుని పల్లె దవాఖానలు ప్రారంభించాలి.

పల్లె దవాఖానలు అందుబాటులోకి తేవాలి..

- తోట రాజు, తాడూరు



పల్లె దవాఖానలు త్వరగా అందుబాటులోకి తేవాలి. నిర్మాణం పూర్తి చేసుకుని మూడేళ్లు అవుతోంది. అధికారులను అడిగినా స్పందన లేదు. అద్దె ఇంట్లో ఇరుకు గదుల్లో పల్లె దవాఖాన కొనసాగుతోంది. నిర్మాణం పూర్తయినా ఎందుకు ప్రారంభించడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వెంటనే పల్లె దవాఖానలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలి.

వామన్‌రావు దంపతుల హత్య కేసులో కొనసాగుతున్న విచారణ

మంథని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయవాదులు గట్టు వామన్‌రావు-నాగమణి దంపతుల హత్యకేసు విచారణను సీబీఐ అధికారులు వేగవంతం చేస్తున్నారు. కేసు విచారణలో భాగంగా పలువురికి నోటీసులు ఇచ్చి విచారణకు పిలిచి వివరాలు సేకరిస్తున్నారు. బుధవారం పెద్దపల్లి జిల్లా, మంథని మాజీ ఉపసర్పంచ్, హైకోర్టు న్యాయవాది ఇనుముల సత్యనారాయణను, ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన జర్నలిస్టు బొల్లంపల్లి సంతోష్ గౌడ్‌ను రామగుండం కమిషరేట్‌లో ఉన్న సీబీఐ క్యాంపు ఆఫీసులో అధికారులు విచారించారు. ఈ ఇద్దరిని దాదాపు మూడు గంటల పాటు అధికారులు పలు అంశాలపై లోతుగా విచారించి వివరాలు సేకరించారు. వామన్‌రావుతో ఉన్న సంబంధాలపై ఆరాతీశారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకు సంబంధించిన రూ.9 వందల కోట్ల కేసు, ఇన్‌కంట్యాక్స్ కేసు తదితర అంశాలపై ఇనుముల సత్యనారాయణను అధికారులు ప్రశ్నించి వివరాలు సేకరించారు. మరికొందరిని సైతం సీబీఐ విచారించనున్నట్లు సమాచారం.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

మానకొండూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్‌లోని సదాశివపల్లికి చెందిన సాయిని మహిపాల్ (34)అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక సీఐ సంజీవ్ తెలిపిన వివరాల ప్రకారం.. సదాశివపల్లికి చెందిన మహిపాల్ అనే యువకుడికి పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కొద్ది రోజుల క్రితం భార్యతో విడాకులు జరిగాయి. అప్పటి నుంచి ఒంటరిగా ఉండడమే కాకుండా మద్యానికి బానిసై అనారోగ్యానికి గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది మంగళవారం రాత్రి ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తల్లి కనుకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బుగ్గ ప్రాంతంలో పెద్దపులి సంచారం

- అంతర్గాం - బసంత్‌నగర్ రోడ్డుపై కనిపించిన పులి
- ఆనవాళ్లు వెతుకుతున్న ఫారెస్ట్ అధికారులు

గోదావరిఖని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండలం బుగ్గ ప్రాంతంలో పెద్దపులి సంచారం కలకలం రేపింది. బుధవారం సాయంత్రం 4గంటల ప్రాంతంలో బసంత్ నగర్ నుంచి అంతర్గాం వైపు వెళ్లే బుగ్గ రోడ్డుపై పెద్దపులి దర్జాగా నడుస్తూ బాటసారుల కంటపడింది. కొందరు ఫొటోలు, వీడియోలు తీశారు. బసంత్‌నగర్ గుట్ట, బుగ్గ ప్రాం తంలో వర్షాకాలం నేపథ్యంలో దట్టంగా అడవి పెరిగింది. రాజీవ్‌రహదారికి ఇవతలి వైపు ఎన్‌టీపీసీ వాటర్‌డ్యామ్ వెనుకాల కూడా వందల ఎకరాల్లో దట్టమైన చెట్లు ఉండడంతో ఎక్కడి నుంచో పులి ఈ ప్రాంతానికి వచ్చినట్టు తెలుస్తున్నది. అయితే నిత్యం రద్దీగా ఉండే రాజీవ్ రహదారి, రైల్వేట్రాక్‌తో పాటు పరిశ్రమలకు నెలవైన ఈ ప్రాంతంలో పులి సంచారం అనేది చాలా ఏళ్ల


అంతర్గాం - బసంత్‌నగర్ రోడ్డుపై పెద్దపులి

తరువాత కనిపించింది. బసంత్‌నగర్ నుంచి అంతర్గాంకు రాత్రి పగలు లేకుండా కార్లపై, బైక్‌లపై, సైకిళ్లపై రాకపోకలు సా గుతాయి. కొందరు పాదచారులు కూడా నడుస్తారు. బ్రాహ్మణపల్లి, ఆకెనపల్లి, లంబాడి తండ, కుంద నపల్లి గ్రామాలకు సంబంధించిన పశువులు, పశువుల కాపర్లు, ప్రజలు వంటచెరకు కోసం వెళ్లేవారు రాత్రి,పగలు ఆ ప్రాంతంలో సంచరిస్తూ ఉంటారు. ఎన్‌టీపీసీ యాష్‌పాండ్ చుట్టూ ఉన్న ప్రాంతమంతా వర్షాకాల నేపథ్యంలో దట్టమైన చెట్లపొదలతో నిండిపోయింది. లంబాడి తండా పూర్తిగా అడవిని ఆనుకునే ఉంటుంది. అయితే ఈ విషయం తెలుసు కున్న ఫారెస్టు అధికారులు పులి పాదచారులకు కనిపించిన బుగ్గరోడ్డులో బుధవారం రాత్రి పరిశీలించారు. రాత్రి వేళల్లో పులికి సంబంధించిన పాద ముద్రలేవి ఫారెస్ట్ అధికారులకు కనిపించలేదు. కానీ ప్రయాణికులు పులి రోడ్డుపై వెళుతుండగా తీసిన ఫొటోలు బుగ్గ రహదారివేనని ధ్రువీకరించారు.

అపస్మారక స్థితిలో వృద్ధదంపతులు

- చికిత్స పొందుతూ భర్త మృతి, భార్య పరిస్థితి విషమం



అనుమానాస్పదంగా పడి ఉన్న గజ్జెల శంకరయ్య, లక్ష్మీ

గంగాధర, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): గంగాధర మండలం గర్షకుర్తిలో అపస్మారక స్థితిలో ఇంటిలో పడిపోయిన వృద్ధదంపతులను చికిత్స నిమిత్తం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ భర్త మృతి చెందగా, భార్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... గర్షకుర్తి గ్రామానికి చెందిన గజ్జెల శంకరయ్య, లక్ష్మీ వృద్ధ దంపతులు. మంగళవారం రాత్రి ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్నారని గ్రామస్థుల సమాచారంతో కరీంనగర్‌కు తరలించి చికిత్స అందించారు. శంకరయ్య పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మృతి చెందాడు. లక్ష్మీ కోమాలోనే ఉండగా పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. శంకరయ్య మృతి పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, పలు కోణాల్లో విచారణ చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. అయితే వీరికి సంతానం లేకపోవడం, గ్రామానికి చివరన ఇల్లు ఉంది. దీన్ని అవకాశంగా తీసుకున్న దుండగులు వారిపై మత్తు మందు చల్లి వృద్ధురాలి మెడలోని బంగారం ఎత్తుకెళ్లినట్లు గ్రామస్థులు అనుమానిస్తున్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య


అజయ్ (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పెగడపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెగడపల్లి గ్రామానికి చెందిన గోపగాని అజయ్‌కుమార్(26) బీటెక్ ఫెయిల్ కావడంతో మద్యానికి బానిసగా మారి జల్సాలకు అలవాటుపడ్డాడు. వ్యవసాయ పెట్టుబడి కోసం తెప్పిం చిన అప్పు, జల్సాలకు చేసిన అప్పులు అధికమయ్యాయి. దీంతో మానసికంగా కుంగిపోయిన అజయ్ గత శనివారం పొలం వద్ద గడ్డి మందుతాగి, కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు వెంటనే చికిత్సకోసం సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సకోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందు తూ బుధవారం మృతిచెందాడు. ఈ మేరకు అజయ్‌కుమార్ తండ్రి సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

చలాన్లపై పోలీసు శాఖ సీరియస్

● ఫైన్ కట్టకుంటే వాహనం సీజ్ ● 45 రోజులు దాటితే అంతే ● ఏటా రూ.3.85 కోట్ల జరిమానా

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : చలాన్లపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని 13 పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించారని ప్రతిరోజు దాదాపు 500 వాహనాలకు ఈ-చాలన్ రూపంలో ఫైన్ వేస్తున్నారు. ఈ విధంగా ప్రతి ఏటా రూ.3.85 కోట్ల ఈ-చలాన్స్ ద్వారా ఫైన్ విధిస్తున్నారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల పరిధిలో ప్రతిరోజు పోలీసులు విస్తృత తనిఖీలు చేస్తున్నారు. మరోవైపు ప్రతి శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ప్రధానంగా హెల్మెట్, రాంగ్ పార్కింగ్, ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, సీట్ బెల్టు, అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్, పొల్యూషన్, ఇన్సూరెన్స్ తదితర నిబంధనలు పాటించని వాహనాలకు ఈ-చాలన్ రూపంలో జరిమానాలు విధిస్తున్నారు. జరిమానా విధించి 45రోజులైనా చెల్లించకుంటే వాహనాన్ని పట్టేస్తున్నారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడితే కోర్టులో హాజరుపరుస్తున్నారు. ఒక్కో వాహనానికి ఐదు జరిమానాలు ఉండి రోడ్డుపై తిరిగితే పోలీసులు వెంటనే పట్టేస్తున్నారు. పెండింగ్ చలాన్ల జరిమానాలు వెంటనే చెల్లించకుంటే వాహనాన్ని సీజ్ చేస్తున్నారు.



● రూ.11.55 కోట్ల జరిమానా..

రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా మూడు సంవత్సరాల్లో వాహనదారులు దాదాపు రూ.11.55 కోట్ల ఈ-చలాన్ జరిమానాలు విధించారు. ఇందులో కేవలం రూ.3.58 కోట్లు మాత్రమే చెల్లించారు. మిగతా రూ.7.97కోట్లు ఈ-చలాన్స్ జరిమానాలు చెల్లించాల్సి ఉంది. జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన దాదాపు రూ.7.97కోట్ల వాహనాలకు ఈ-చలాన్స్ ద్వారా జరిమానాలు విధించగా, 25 శాతం వాహనదారులు మాత్రమే చెల్లించారు. మిగతా వాహన యజమానులు రూ.7.97 కోట్లు జరిమానాలు చెల్లించకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. ఐదు చలాన్లు ఉంటే వెంటనే చెల్లించకుంటే వాహనం సీజ్ చేయడమే కాకుండా వాహనం క్రయవిక్రయాలు చేయకుండా చర్యలు చేపట్టారు. మరోవైపు వాహనదారుడి లైసెన్స్ రద్దుకు రవాణా శాఖకు సిఫారసు చేస్తున్నారు.

● జరిమానా చెల్లించాల్సిందే

- మహేష్ బి. గీతే



జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన ప్రతి ఒక్కరూ జరిమానా చెల్లించాలి. ట్రాఫిక్ చలాన్స్ జరిమానాలు చెల్లించకుండా వాహనాలు నడిపితే చర్యలు తప్పవు. నిబంధనలు పాటించాలి.

ఏసీబీకి చిక్కిన ముగ్గురి రిమాండ్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఒక ఆసుపత్రి నిర్వాహకుడి వద్ద నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన కేసులో కరీంనగర్ డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ మర్యాల శ్రీనివాసులు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్తీక్ భరద్వాజ్ రెడ్డి, ప్రైవేట్ సహాయకుడు రాములను బుధవారం ఏసీబీ కోర్టులో హాజరుపరిచారు. ముగ్గురు నిందితులకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించగా జిల్లా జైలుకు తరలించారు. ఏసీబీ పోలీసులు అరెస్టు చేసిన డ్రగ్ కంట్రోల్ అధికారులు శ్రీనివాసులు, కార్తీక్ భరద్వాజ్‌రెడ్డి వద్ద బ్యాగ్‌లలో తనిఖీ చేయగా రూ.లక్షా 73 వేల నగదు పట్టుబడింది.

హైదరాబాద్, వరంగల్‌లోని ఈ ఇద్దరు అధికారుల ఇళ్లలో ఏసీబీ పోలీసు బృందాలు తనిఖీలు నిర్వహించాయి. బ్యాంక్ పాస్‌బుక్‌లు, లాకర్‌లు, ఇతర ఆస్తుల డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. బ్యాంక్ ఖాతాలు, లాకర్‌లను ఫ్రీజ్ చేసినట్లు, ఈ ఇద్దరు అధికారుల అవినీతిపై రెండు నెలల నుంచి ఏసీబీకి చాలా ఫిర్యాదులు అందినట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


రాకేష్ (ఫైల్)

మానకొండూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన రామగిరి రాకేష్ (24) అనే యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి అన్నారం గ్రామానికి చెందిన రామగిరి రాకేష్, నరేష్‌లు సోమవారం ద్విచక్ర వాహనంపై మండలంలోని లింగాపూర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా జగ్గయ్యపల్లి వద్ద ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో పై ఇద్దరికి తీవ్రగాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించగా బుధవారం చికిత్స పొందుతూ రాకేష్ మృతి చెందినట్లు సీఐ సంజీవ్ తెలిపారు.

శాంతినగర్‌లో కార్డన్ సెర్చ్

- ధ్రువీకరణ పత్రాలు లేని 105 వాహనాలు సీజ్



శాంతినగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న అడిషనల్ డీసీపీ వెంకటరమణ

కరీంనగర్ క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్, వినాయకనగర్‌లో బుధవారం ఉదయం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 77 ద్విచక్రవాహనాలు, 27 ఆటోలు, ఒక ట్రక్‌ను సీజ్ చేశారు. పాత నేరస్థులు అద్దెకు ఇల్లు తీసుకొని నివసిస్తున్నారా? అని ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు స్థానిక ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం అడిషనల్ డీసీపీ వెంకటరమణ మాట్లాడుతూ సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించారు. సైబర్ నేరానికి గురైతే నేరం జరిగిన గంట లోపల 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని, సొమ్మును ఫ్రీజ్ చేసి తిరిగి పొందవచ్చని తెలిపారు. మాదక ద్రవ్యాల దుర్వినియోగం, దుష్పరిణామాలపై వివరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, ఇన్‌స్పెక్టర్లు బిల్లా కోటేశ్వర్, ప్రదీప్ కుమార్, సంజీవ్, సదన్ కుమార్ పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు

కాకతీయ కాలువలో గుర్తు తెలియని మృతదేహం

హుజూరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ కాకతీయ కాలువలో గుర్తు తెలియని మృతదేహం కొట్టుకుపోతుండగా బుధవారం స్థానికులు గుర్తించారు. మృతదేహం గుర్తు పట్టకుండా ఉన్నది. మృతదేహాన్ని ఎవరూ బయటకు తీయకపోవడంతో కాలువలోనే కొట్టుకుపోయింది. ఘటన వివరాలు తెలియాల్సి ఉన్నది.

మహిళా పోలీసులతో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు


తనిఖీలు నిర్వహిస్తున్న మహిళా పోలీసులు

ఇల్లందకుంట, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండల కేంద్రంలో మహిళా పోలీసులచే బుధవారం డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. సేఫ్ హ్యాండ్స్ విత్ తెలంగాణ పోలీస్-నారీ శక్తి కార్యక్రమంలో భాగంగా మహిళా పోలీసులు విస్తృత స్థాయిలో వాహనాల తనిఖీ, డ్రంకెన్ డ్రైవ్, లా అండ్ ఆర్డర్ విధుల్లో భాగంగా బ్లూకోల్ట్ విధులు నిర్వహించారు. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించారు.

వరికి దోమ కాటుతో రైతు విలవిల

● సన్న రకం వరికి దోమకాటు, కాటుక తెగులు ● డ్రోన్‌లతో పురుగు మందు పిచికారి ● రైతులకు పెరుగుతున్న ఖర్చులు

సైదాపూర్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వరి గొలుసు పూర్తిగా బయటకు వచ్చి గింజలు అయ్యే సమయంలో దోమకాటు, కాటుక తెగులు(నల్లి పురుగు) సోకుతోంది. దీంతో వరి నలుచుగా మారడం, గింజలు నల్లబడి తాలుగా మారుడం జరుగుతుంది. వర్షాలు ఎక్కువ కురుస్తుండడంతో నేల ఎండకుండా ఎప్పటికి తేమగా ఉండడంతో వరిలో దోమ, కాటుక తెగులు సోకుతుంది. ఎక్కువగా ఈ దోమ కాటు, కాటుక తెగులు సన్నరకం వరికే ఆశిస్తుంది. రైతులు సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం బోనస్ ఇస్తున్నదని చాలా మంది రైతులు సన్నరకం వరిపంటను సాగు చేశారు. ఈ సన్నరకం వరి మొదటి నుంచి పురుగు మందులు పిచికారి చేస్తేనే పంట దిగుబడి వస్తుంది. మొదట పొట్ట దశకు రాకముందు ఘనే పురుగుకు ఆశించకుండా పురుగుమందులు పిచికారి చేశారు. ఇప్పుడు దోమ కాటుతో పాటు, నల్లి పురుగు ఆశిస్తున్నదని రైతులు వాపోతున్నారు. పురుగు మందుల


జాగీర్‌పల్లిలో దోమ కాటుకు గురైన వరి

పిచికారితో పెట్టుబడి పెరిగిపోతున్నదని రైతులు తెలుపుతున్నారు. రైతులు డ్రోన్ల ద్వారా పురుగు మందులు పిచికారి చేస్తున్నారు. డ్రోన్లతో పురుగు మందుల పిచికారికి ఎకరాకు రూ. 500లు తీసుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్నాయని, పొలాలు ఆరడం లేదని, పంట చేతికి వస్తుందో లేదోనని రైతులు


డ్రోన్‌తో పురుగు మందు పిచికారి

ఆందోళన చెందుతున్నారు. సైదాపూర్ మండలంలో సమారు 19వేల ఎకరాలలో వరి పంట సాగు చేశారు. అందులో సుమారు 8వేల ఎకరాల సన్న రకం, సుమారు 11వేల ఎకరాల దొడ్డు రకం వరి సాగు చేశారు. దొడ్డు రకాలకు తక్కువగా చీడ పీడలు అశిస్తున్నాయి. సన్నరకం వరికి ఎక్కువగా చీడపీడలు ఆశిస్తున్నాయని రైతులు తెలపుతున్నారు. పంట చేతికి వచ్చేవరకు నమ్మకం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

- వైదేహి, సైదాపూర్ వ్యవసాయాధికారి



వానాకాలం సీజన్‌లో గింజ గట్టిపడే దశలో వరికి వచ్చే సుడి దోమ, కాటుక తెగులు రాకుండా ఉండేందుకు రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలి. గింజ గట్టిపడే దశలో కాటుక తెగులు రాకుండా ఉండేందుకు రైతులు టెబ్యుకొనజోల్ , ట్రైఫ్లాక్సీస్ట్రోబిన్ 80 గ్రాములు లేదా ప్రొపికొనజోల్ 200మి,లీ ఎకరానికి పిచ్చికారి చేయాలి. సుడిదోమ రాకుండా ఉండేందుకు రైతులు పొలాన్ని ఆరబెట్టాలి. డైనోటెఫ్యూరాన్ 80గ్రా, లేదా పైమెట్రోజైన్ 120గ్రా మొక్కలు మొదళ్ల తడిచేలా చూడాలి.

వీధి కుక్కల పట్టివేత


వీధి కుక్కలను తరలిస్తున్న సిబ్బంది

సుల్తానాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్‌లో కొన్ని నెలల నుంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న కుక్కలను మున్సిపాలిటీ వారు పట్టుకుని ఇతర ప్రాంతాలకు తరలించారు. దీంతో ప్రజలు కొంత ఊపిరి పీల్చుకున్నారు. వీటికి శాశ్వత పరిష్కారంగా చర్యలు చేపట్టాలని, వాటికి కూడా ప్రభుత్వభూమిలో షెడ్డులు ఏర్పాటు చేసి, జీవించేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పలువురు కోరుతున్నారు.

ఆర్టీసీ బస్సు కోసం ఆదర్శ పాఠశాల విద్యార్థుల అవస్థలు

● ప్రత్యేక బస్సు నడిపించాలని కోరుతున్న తల్లిదండ్రులు



పోచంపల్లిలో ఆర్టీసీ బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

మానకొండూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపల్లి గ్రామంలో గల ఆదర్శ పాఠశాల విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు కోసం ఇబ్బందులు పడుతున్నారు. కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారి పోచంపల్లిలో ఆదర్శ పాఠశాల ఉంది. ఈ పాఠశాలలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆరవ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు విద్యనభ్యసిస్తున్నారు. అయితే పాఠశాల ముగిసిన అనంతరం విద్యార్థులు తమతమ గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డు మీదికి వచ్చి గంటల తరబడి వేచి చూస్తుంటారు. జమ్మికుంట నుంచి కరీంనగర్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులు అక్కడి నుంచి ప్రయాణికులతో రద్దీగా వస్తుండడంతో ఆపకుండా వెళ్లిపోతున్నాయి. దీంతో విద్యార్థులు గంటల తరబడి రోడ్డుపై బస్సుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో విద్యార్థులు ఇళ్లలోకి చేరుకొనే సరికి రాత్రి ఏడు గంటల నుంచి 8గంటల సమయం పడుతోంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల చెంజర్లకు చెందిన ఇద్దరు విద్యార్థులు బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తూ బస్సు టైరు కింద పడి తీవ్రంగా గాయపడ్డారు. సమస్యపై కలెక్టర్‌తో పాటు ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందించినా సమస్య పరిష్కారం కావడం లేదని విద్యార్థుల తల్లిందండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఆదర్శ పాఠశాల విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పేద విద్యార్థులకు ప్రోత్సాహం



- 'ఎన్‌ఎంఎంఎస్' ద్వారా ఏడాదికి రూ.12వేలు మంజూరు
- ప్రభుత్వ పాఠశాలల 8వ తరగతి విద్యార్థులు అర్హులు
- 9 నుంచి ఇంటర్ వరకు అందనున్న కేంద్ర సాయం
- ఈనెల 14 వరకు దరఖాస్తుకు గడువు
- నవంబరు 23న ప్రతిభ పరీక్ష

వెల్గటూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతిభావంతులైన పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేంద్రం ప్రభుత్వం 2008లో నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ (ఎన్‌ఎంఎంఎస్) అమల్లోకి తీసుకొచ్చింది. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా జాతీయ ఉపకార వేతనాన్ని అందజేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్‌కు అర్హులు. ఎంపికైన విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12 వేలు చొప్పున మొత్తం రూ.48 వేలు కేంద్ర ప్రభుత్వం అందించనున్నది. ఈ నగదు నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది. పదో తరగతి తరువాత ఈ ఉపకార వేతనం కొనసాగాలంటే 60 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. అయితే విద్యార్థులు ఆయా కళాశాలల్లో ఉపకార వేతనం కోసం వివరాలను అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. కాగా గత ఏడాది జగిత్యాల జిల్లా నుంచి ఎన్‌ఎంఎంఎస్‌కు 72 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ ఏడాదిలో సంఖ్యను పెంచేందుకు నవంబర్‌లో జరగనున్న పరీక్షకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.

● ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఈనెల 14 వరకు ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందు కోసం జనరల్, బీసీ విద్యార్థులకు రూ.100, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆర్థిక స్థోమత లేని విద్యార్థుల చదువులు మధ్యలో ఆపేయకుండా జాతీయ ఉపకార వేతనాలు ఉపయోగపడతాయని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.



పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు(ఫైల్)

● అర్హతలు

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ప్రతిభా పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదువు తున్న విద్యార్థులు అర్హులు. ప్రభుత్వ పాఠశాలల్లో అభ్యసించే విద్యార్థులు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. 7వ తరగతిలో కనీసం 55 శాతం మార్కులు సాధించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 5 శాతం మార్కులు సడలింపు ఉంటుంది. అలాగే విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలకు మించి ఉండకూడదు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్ దరఖాస్తు ఫాంతో పాటు 7వతరగతి మార్కుల జాబితా, ఆధార్‌కార్డు, స్టడీ, ఆదాయ, కుల ధ్రువీకరణ జిరాక్స్ ప్రతులను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాల్సి ఉంటుంది.

● పరీక్ష విధానం

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష బహుళైచ్ఛిక ప్రశ్నల రూపంలో రెండు విభాగాలు ఉంటాయి. మొదటి విభాగంలో మానసిక సామర్థ్య పరీక్షకు సంబంధించి 90 మార్కులకు 90 ప్రశ్నలు ఉంటాయి. రెండవ విభాగంలో 7,8 తరగతులు సిలబస్ నుంచి 90 మార్కులకు 90 ప్రశ్నలు ఉంటాయి. దీనిలో గణితం నుంచి 20 మార్కులు, భౌతిక, రసాయన, జీవశాస్త్రం నుండి 35 మార్కులు, సాంఘికశాస్త్రం నుండి 35 మార్కులు ఉంటాయి.

సద్వినియోగం చేసుకోవాలి

-ప్రభాకర్, వెల్గటూర్ ఎంఈవో



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కేంద్రం ప్రభుత్వం నాలుగేళ్ల పాటు అందించనున్న ఉపకార వేతనాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఏడాదికి రూ.12 వేల చొప్పున అందనున్నాయి. దీనితో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గనుంది. విద్యార్థులు ఇప్పటి నుంచే పరీక్ష రాసేందుకు సన్నద్ధమవ్వాలి.

ఆర్టీసీకి దసరా బొనాంజా

● కరీంనగర్ రీజియన్‌కు రూ.4.8 కోట్ల ఆదాయం ● 1,680 స్పెషల్ బస్సులతో ప్రయాణికులకు సేవలు

భగత్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలు ఆర్టీసీకి లాభాలను తెచ్చిపెట్టాయి. పండుగల సందర్భంగా ఆర్టీసీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక బస్సులను నడిపించింది. కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల్లో రెగ్యులర్ సర్వీసులతోపాటు 1,680 స్పెషల్ బస్సులతో గత నెల 27 నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు ప్రయాణికులకు సేవలందించింది. కరీంనగర్ రీజియన్‌లోనే మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణం చేసిన మహిళల నుంచి 2,75,75,749 రూపాయల ఆదాయం సమకూరినట్లు రీజినల్ మేనేజర్ ప్రకటించారు. స్పెషల్ బస్సుల ద్వారా మహాలక్ష్మి పథకంతో కలిపి 4,80,01,642 రూపాయల ఆదాయం సమకూరింది. మొత్తం 10 రోజుల్లో మహాలక్ష్మి పథకం ఉచిత ప్రయాణికులతో కలిపి 4,63,119 మంది వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించారు. గోదావరిఖని డిపో 260 స్పెషల్ బస్సులను నడిపించగా 73,78,376 రూపాయల ఆదాయం వచ్చింది. హుస్నాబాద్ నుంచి 100 బస్సులను నడిపించగా 28,37,837, హుజురాబాద్ డిపోకు చెందిన 110 బస్సులకు 31,21,621, కరీంనగర్-1 డిపో నుంచి 170 బస్సులను నడిపించగా 48,24,323 రూపాయల ఆదాయం వచ్చింది. కరీంనగర్-2 డిపో 270 బస్సులకు 76,62,160, మంథని డిపో నుంచి 120 బస్సులకు 35,87,338, జగిత్యాల డిపో 140 బస్సులకు 40,73,725, కోరుట్ల డిపో 120 బస్సుల ద్వారా 34,05,404 రూపాయల ఆదాయం వచ్చింది. మెట్‌పల్లి డిపోకు చెందిన 140 బస్సుల ద్వారా 39,72,972, సిరిసిల్ల డిపోకు 130 బస్సుల ద్వారా 36,89,188, వేములవాడ డిపోకు 120 బస్సుల ద్వారా 34,48,698 ఆదాయం వచ్చినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.



శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

జగిత్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు వరద నీరు రావడం బుధవారం కొనసాగింది. 16 గేట్లు పైకి ఎత్తి 49,984 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 59,774 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.053 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు నుంచి 59,774 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో కాకతీయ కాలువకు 4,000, సరస్వతీ కాలువకు 650 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా 4,000 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 709 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో

బోయినపల్లి : శ్రీ రాజరాజేశ్వర జలాశయనికి(మిడ్ మానేరు) ప్రాజెక్టుకు బుధవారం 2200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. వరద కాలువ ఇన్‌లెట్స్‌తో పాటు ములవాగు ద్వారా2200 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తోంది. దిగువకు ఒక గేట్ ద్వారా 1500 క్యూసెక్కులు, ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు . ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 27.55 టీఎంసీలకు గాను 27.145 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో సీసీ టీవి ఇన్‌స్టలేషన్, సర్వీసింగ్‌పై ఉచిత శిక్షణకు దరఖాస్తులకు ఆహ్వానం పలుకుతున్నట్లు సంస్థ డైరెక్టర్ సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23న ప్రారంభం కానున్న శిక్షణ 13 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి, అర్హత గల 18 నుంచి 45 సంవత్సరలలోపు ఉన్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన గ్రామీణ పురుష అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఫోన్. 9502593347, 9849411002 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపిక

చొప్పదండి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో జరిగే ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి తైక్వాండో అండర్-17 పోటీలకు చొప్పదండి జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. కె సౌమ్య, పి కాశీవిశ్వనాథ్ జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కె కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్యుల రాజిరెడ్డి విద్యార్థులను, పీడీని అభినందించారు.

రూ.6,800 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర రూ.6,800 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 55మంది రైతులు 392క్వింటాళ్ల విడి పత్తి, ఇద్దరు రైతులు మూడు క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,800, కనిష్ఠ ధర రూ.4,500 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

హార్వెస్టర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

● ఒకరి మృతి



ప్రమాదస్థలంలో హార్వెస్టర్

తిమ్మాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామం వద్ద రాజీవ్ రహదారిపై బుధవారం అర్ధరాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ హార్వెస్టర్ కరీంనగర్ వైపు నుంచి హైదారాబాద్ వైపునకు వెళుతుండగా వెనుక నుంచి మంచిర్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి ముందుగా వెళుతున్న హార్వెస్టర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో హార్వెస్టర్‌పై ఉన్న హెల్పర్ పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన గుర్రాల సాగర్ (28) తీవ్రగాయాలతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. డ్రైవర్ పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట గ్రామానికి చెందిన గుండ్రాతి సంతోష్ గాయపడ్డాడు. బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ సంఘటన స్థలానికి వెళ్లి గాయపడ్డ వ్యక్తిని ఆసుపత్రికి తరలించారు. వివరాలు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి

ఆస్పత్రికి తరలించిన పోలీసులు

వేములవాడ క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని సాయినగర్‌లో బుధవారం అర్ధరాత్రి ఓ వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేశాడు. సాయినగర్‌లోని ఓ ఇంట్లో ఈ ఘటన చోటుచేసుకుంది. సంఘటన తెలుసుకున్న నైట్ పెట్రోలింగ్ పోలీసులు గాయాలతో కింద పడిన వ్యక్తిని వెంటనే అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు.

ఘనంగా పుష్పయాగం.. ఏకాంత సేవ



పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు



ఏకాంత సేవలో స్వామివారు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామి వారి బ్రహ్మోత్సవాలను దేవాదాయ - ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం ఉదయం పట్టణ పురవీధుల గుండా శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చాడు. రాత్రి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో చక్రస్నానం, శ్రీ పుష్పయాగం, ఏకాంత సేవను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కార్యనిర్వహణాధికారి మారుతిరావు, పండితులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సహకారంతోనే అభివృద్ధి

తిమ్మాపూర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులందరి సహకారంతోనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని కరీంనగర్ ఇరిగేషన్ ఇంజనీర్ ఇన్ చీఫ్ మధుసూదన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని ఎల్‌ఎండీ కాలనీలో గల ఇరిగేషన్ ఈఎన్‌సీ కార్యాలయ సమావేశ మందిరంలోటీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఇరిగేషన్ శాఖ మహిళాలకు జిల్లా స్థాయిలో బహుమతులు రావడంతో వారికి అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఈఎన్‌సీ మధుసూదన్ రావు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ప్రభుత్వంలో ఉద్యోగుల సమస్యలు తీరుతున్నాయని, పర్మినెంట్ ప్రమోషన్లు వస్తున్నాయని తెలిపారు. ఇరిగేషన్ శాఖలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఉన్నారన్నారు. ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండాలన్నారు. బతుకమ్మ వేడుకల్లో జిల్లా స్థాయిలో బహుమతులు సాధించిన మహిళా ఉద్యోగులను మదుసూదన్‌రావు అభినందించారు. తెలంగాణ వచ్చిన తరువాత బతుకమ్మ పండగ పల్లెటూళ్ల నుంచి పట్నాలకు అక్కడి నుంచి దేశ విదేశాలకు పాకిందని అన్నారు. టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ రాష్ట్రానికి గుండెకాయలంటిం దని అన్నారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బులను ప్రభుత్వం ఇవ్వలేకపోవడం చాలా బాధకారం అన్నారు. ఉద్యోగులు ఐక్యంగా ఉంటేనే సమస్యలు పరిష్క రించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కాళేశ్వరం ఈఎన్‌సి సురేందర్‌రెడ్డి, ఎస్‌ఈలు సుమతి దేవి, శ్రీనివాస్ గుప్త, ఈఈ జగన్, జిల్లా టీఎన్జీవో అధ్యక్ష, కార్యదర్శులు దారం శ్రీనివాస్‌రెడ్డి, సంగెం లక్ష్మణ్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాగి శ్రీనివాస్, హర్మిందర్ సింగ్, గూడ ప్రభాకర్, సంయుక్త కార్యదర్శి మన్నె సరిత, జిల్లా నాయకులు ఉద్యోగులు పాల్గొన్నారు.



ఉద్యోగులను అభినందిస్తున్న ఈఎన్సీ మధుసుదన్‌రావు

ఆలయ వివరాలపై రిపోర్టులతో సిద్ధంగా ఉండాలి

● దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియ

కరీంనగర్ కల్చరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టం 2005 అవగాహన సదస్సు, వారోత్సవాల్లో భాగంగా ఉమ్మడి జిల్లాలోని దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల వివరాలపై రిపోర్టులతో సిద్ధంగా ఉండాలని సహాయ కమిషనర్ నాయిని సుప్రియ అన్నారు. బుధవారం ఏసీ కార్యాలయంలో ఈఓలు, మేనేజర్లు, ఇన్‌స్పెక్టర్లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. ఆలయాల నుంచి శాఖకు బకాయిలు చెల్లించాలని, ఆడిట్ లెక్కలు పూర్తి చేయాలని అన్నారు. ఆలయ భూముల రిజిస్ట్రేషన్ చేసి జీపీఎస్‌లో వివరాలు పొందుపర్చాలన్నారు. నూతనంగా రిజిస్ట్రేషన్ అయిన దేవాలయాల వివరాలను అప్‌డేట్ చేయాలని సూచించారు. కొత్త ఈవోలు పాత ఈవోల నుంచి బంగారు, వెండి ఆభరణాలను, వాటి లెక్కలను స్వాధీనం చేసుకోవాలన్నారు. ఆలయాలకు సంబంధించి కోర్టులో కేసులుంటే కౌంటర్ ఫైల్ చేయాలని ఆదేశించారు. ఇన్‌స్పెక్టర్లు నెలవారి ఆలయాల సందర్శన రిపోర్ట్‌ను సమర్పించాలని, ఏసీ కార్యాలయంలో ఆయా ఆలయాలకు చెందిన ఏమైనా పెండింగ్ పనులు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీ సుప్రియ

సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ చిరునామా

- మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్



లక్కీడ్రాలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్

భగత్‌నగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సురక్షిత ప్రయాణానికి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) చిరునామాగా నిలుస్తుందని మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆవరణలో దసరా స్పెషల్ లక్కీ డ్రా విజేతలకు బహుమతులను ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని సూచించారు. ఆర్టీసీ రీజినల్ మేనేజర్ బి.రాజు మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ప్రయాణికులు ఆర్టీసీ సేవలను వినియోగించుకున్నారన్నారు. డిప్యూటీ మేనేజర్ ఎస్.భూపతిరెడ్డి, కరీంనగర్ ఒకటి, రెండో డిపో మేనేజర్లు ఐ. విజయ మాధురి, ఎం.శ్రీనివాస్, బస్‌స్టేషన్ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఎల్.మల్లేశం, అకౌంట్స్ ఆఫీసర్ శంకరయ్య పాల్గొన్నారు.

లక్కీడ్రా విజేతలు

కరీంనగర్ రీజియన్ పరిధిలోని 11 డిపోల బస్సుల్లో ప్రయాణించిన వారిల్లో మొదటి బహుమతి రూ.25,000ను ఈ.రమేశ్ (కరీంనగర్), రెండో బహుమతి రూ.15,000 వి.సదానందం (గోదావరిఖని), మూడో బహుమతి రూ.10,000 కె.నాగరాజు (జగిత్యాల) దక్కించుకున్నారు.

ముగిసిన రీజినల్ ఫారెస్టు క్రీడలు

- పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా సిద్దిపేట జోన్



పోటీల విజేతలకు పతకాల ప్రదానం

కరీంనగర్ స్పోర్ట్స్ అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రాంతీయ క్రీడా పాఠశాల మైదానంలో రెండు రోజులు నిర్వహించిన రీజినల్ ఫారెస్ట్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ బుధవారం రాత్రి ముగిశాయి. అన్ని క్రీడల్లో అధిక పాయింట్లు సాధించిన సిద్దిపేట జిల్లా జోన్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచింది. పోటీల్లో రాజన్న జోన్‌లోని కరీంనగర్, కామారెడ్డి, సిద్దిపేట, మెదక్, రాజన్న సిరిసిల్ల నుంచి 400 క్రీడాకారులు హాజర య్యారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, అథ్లెటిక్స్, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్, టగ్గాఫ్ వార్ క్రీడాంశాల్లో పోటీలను నిర్వహించారు. విజేతలకు ముగింపు సమావేశంలో కరీంనగర్ డీఎఫ్‌వో బాలమణి, కామారెడ్డి డీఎఫ్‌వో బోగాని నిఖిత, మెదక్ డీఎఫ్‌వో జోజి, సిరిసిల్ల, సిద్దిపేట జిల్లాల డీఎఫ్‌వోలు పతకాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు క్రీడలు మానసిక ప్రశాంతను కలిగించాయన్నారు. పోటీల్లో ప్రతిభచాటిన క్రీడాకారులు వచ్చేనెలలో జరుగనున్న రాష్ట్రస్థాయి అటవీశాఖ ఉద్యోగుల క్రీడలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి.శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

మద్యం టెండర్లపై 'స్థానిక' ఎఫెక్ట్

(5వ పేజీ తరువాయి)

నాయకులు ఎన్నికల ఖర్చు కోసం డబ్బులను సమకూర్చుకుంటున్నారు. ఈ క్రమంలో మద్యంషాపుల కోసం దర ఖాస్తు చేసుకుని ఉన్న డబ్బులు పోగొట్టు కోవడమెందుకని చాలామంది భావిస్తు న్నారు. డ్రాలో షాపు తగలకుంటే 3లక్షల రూపాయలు ప్రభుత్వం పాలు కావాల్సిం దే. మరోవైపు.. టెండర్లలో పాల్గొనా లంటూ ప్రభుత్వం రిటెయిల్ షాపులను నిర్వహిస్తున్న వ్యాపారులపై ఎక్సైజ్ అధి కారులు ఒత్తిడి పెంచుతున్నారు. కేవలం ఒకటి, రెండు దరఖాస్తులే గాకుండా ఐదుకు తగ్గకుండా దరఖాస్తు చేయాలని చెబుతున్నట్లు సమాచారం. ఈనెల 10, 12, 13, 15, 16, 17వ తేదీలు మంచి రోజులు కావడంతో ఆ రోజుల్లో దరఖా స్తులు ఎక్కువగా వస్తాయని జిల్లా ఎక్సై జ్ అధికారులు భావిస్తున్నారు.

ఎస్‌జీఎఫ్ జిల్లా స్థాయి చదరంగ పోటీలు

ఎలిగేడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎలి గేడు ప్రభుత్వఉన్నత పాఠశాలలో 69వ ఎస్ జీఎఫ్ జిల్లాస్థాయి అండర్14,17 బాలబాలి కల చదరంగపోటీలు ఈనెల11న నిర్వహించ నున్నట్లు ఆర్గనైజింగ్‌సెక్రెటరీ కనుకుంట్ల లక్ష్మ ణ్ తెలిపారు. ఈ ఎంపికపోటీల్లో పాల్గొనే చదరంగ క్రీడాకారులు తమఅర్హత ఫామ్‌తో పాటు సొంత చదరంగ బోర్డుతో ఉదయం 9 గంటలకు రిపోర్టుచేయాలని పేర్కొన్నారు.

ఆహ్లాదాన్ని పంచని ఎకో పార్కు

- నిర్వహణ లోపంతో నిరుపయోగం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం



మంథనిలో ఎకో పార్కు

మంథని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఏకో పార్కు నిర్వహణను గాలికి వదిలి వేశారు. స్థానిక బోయినిపేటకు వెళ్ళే ప్రధాన రహదారి పక్క ఏర్పాటు చేసిన ఏకో పార్కులో మున్సిపల్ సిబ్బంది కొద్ది నెలలుగా పట్టించుకునే వారులేక పార్కుకు వచ్చే వారు తీవ్ర నిరాశకు గుర వుతున్నారు. పార్కులో చిన్నారులు ఆడుకునే క్రీడా సామగ్రి తుప్పు పట్టిపోతుంది. చెత్తాచెదారం, పిచ్చి మొక్కలతో నిండిపోయింది. పట్టణ శివారు ప్రాం తంలో ఉండటంతో పార్కు ప్రహరీ పై నుంచి దూకి పార్కులోకి దిగుతున్న మందుబాబులు తమ అడ్డాగా మార్చుకున్నారు. సందర్శకులు ఎవరూ రాకపోతుండ టంతో ఉదయం నుంచి అర్థరాత్రి వరకు పార్కులోని చెట్ల పొదల్లో మందుబాబులు జల్సా చేస్తున్నారు. ఎక్కడ పడితే అక్కడ తాగి పడేసిన ఖాళీ మందు సీసాలు దర్శనమిస్తున్నాయి. బాత్ రూం భవనానికి డోర్లు లేని కార ణంగా అసాంఘిక కార్యకలాపా లకు నిల యంగా మారింది. పా ర్కును అడ్డగా చేసుకొని గంజా యి సేవిస్తూ ఎంజాయ్ చేస్తు న్నారు. జులాయి జంటలకు అ డ్డాగా మారింది. స్థానికులు సైతం పార్కు పరిసరాలను అపరి శుభ్రంగా మారుస్తున్నారు. దీంతో పార్కు ఏరియాలో దుర్గంధం వెదజల్లుతుంది. మున్సి పల్ పరిధిలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు ఎలాంటి పార్కులు లేక పోగా ఉన్న ఒక్క ఏకో పార్కు సైతం నిర్వాహణ లేక ప్రజలు తీవ్ర నిరాశ చెందుతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు ఏకో పార్కుపై ప్రత్యేక దృష్టి సారించి మున్సిపల్ ద్వారా సరైన నిర్వహణ చేపట్టి ప్రజలకు, చిన్నారులకు, సందర్శకులకు ఆహ్లాదాన్ని పంచే విధంగా చర్యలు తీసుకోవాలని, మందు, గంజాయి, జల్సా బ్యాచ్‌లకు పార్కు వైపు రాకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఏకో పార్కులో ప్రజలకు, చిన్నారులకు మరిన్ని సౌకర్యాలు కల్పించే విధంగా చూడాలని కోరుతున్నారు.



వాడిపడేసిన ఖాళీ ప్లాస్టిక్ బాటిళ్లు

నేటి నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ నామినేషన్ల స్వీకరణ

మంథని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మంథని డివిజన్‌లో స్థానికసంస్థల ఎన్నికల నిర్వాహణ కోసం అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేశారు. వాయిదాల పర్వంగా కొనసాగుతున్న హైకోర్టు తీరుపై అందరిలో ఉత్కంఠ ఉన్నప్పటికీ ఈసీ విడుదల చేసిన షెడ్యూల్ ప్రకారం నేటి నుంచి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోసం నామినేషన్ల పర్వం ప్రారంభం కానుంది. మంథని మండలంలో ఉన్న 11 ఎంపీటీసీ స్థానాలకు స్థానికఎంపీడీవో కార్యాలయంలో 4నామినేషన్ల స్వీకరణ కేంద్రాలను ఏర్పాటుచేశారు. ఎంపీ డీవో చాంబర్‌లోని 1వ కౌంటర్‌లో అక్కెపల్లి, లక్కెపూర్, గుంజపడుగు, ఇందిరమ్మమోడల్ హైజ్‌లోని 2వ కౌంటర్‌లో గద్దలపల్లి, సూరయ్యపల్లి, కన్నాల, సూపరింటెంట్ చాంబర్ లోని 3వ కౌంటర్‌లో నాగెపల్లి, ఆరెంద, ఈ-పంచాయతీ కార్యాలయంలోని 4వకౌంటర్‌లో ఉప్పట్ల, చిల్లపల్లి, ఎక్లాస్ పూర్ ఎంపీటీసీ స్థానాలకు, సమావేశ మందిరంలో జడ్పీ టీసీ స్థానానికి అభ్యర్థుల నుంచి ఎన్నికల అధికారులు నామినేషన్లు స్వీకరించే విధంగా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల మండల ప్రత్యేక అధికారిగా మిషన్ భగీరథ ఈఈ పూర్ణ చందర్‌రావు, సహాయ ఎన్నికల అధికారిగా ఎంపీడీవో శశికళను నియమించారు.

రామగిరి: నామినేషన్‌ల స్వీకరణకు మండలంలో నాలు గు క్లస్టర్‌లను ఏర్పాటు చేశారు. అందులో సుందిళ్ల, పన్నూ రు, బేగంపేట, లద్నాపూర్ గ్రామపంచా యతీలు ఉన్నాయి. పన్నూరు నామినేషన్ సెంటర్‌లో పన్నూరులో 1,2,3,ఎంపీ టీసీ స్థానాలు, రత్నాపూర్, కల్వచర్ల స్థానాలకు నామినేషన్స్ స్వీకరించనున్నట్లు తెలిపారు. లద్నాపూర్ సెంటర్‌లో లద్నా పూర్, బుధవారంపేట్, స్థానాలకు నామినేషన్స్ స్వీకరించ నున్నట్లు పేర్కొన్నారు. బేగంపేట్ నామినేషన్ సెంటర్‌లో బేగంపేట్, నాగేపల్లి, సుందిల్లనామినేషన్ సెంటర్‌లో సుం దిళ్ల, జల్లారం, సంబంధించిన స్థానాలకు నామినేషన్స్ స్వీకరి స్తారని స్పెషల్ అధికారి శ్రీనాథ్, ఎంపీడీవో శైలజారాణి పేర్కోన్నారు. జడ్పీటీసీ స్థానానికి స్పెషల్‌ఆఫీసర్ శ్రీనాథ్ స్వీకరిస్తారని తెలిపారు.

మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం

మంథని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటానికి అంబేద్కర్‌చౌక్‌లో పూలసంఘం, బోయినిపేటలో ముదిరాజ్‌సంఘం ఆధ్వ ర్యంలో బుధవారం క్షీరాభిషేకం నిర్వహించారు. మంత్రి శ్రీధర్‌బాబు తమ కుల సంఘాల భవనాలకు రూ.20లక్షల చొప్పున ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించడంపై వారు హర్షం వ్యక్తంచేశారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్‌నేతలు వొడ్నాల శ్రీనివాస్, మంథని సత్యం, పెంటరి రాజు, రొడ్డ రాజేశ్వర్‌రావు, పోలు శివ, అజీం, పూల సంఘం నేతలు గుంటుపల్లి సమ్మయ్య, కావేటిసమ్మయ్య, కుమార స్వామి, తిరుపతి, తిరుపతి, ముదిరాజ్ సంఘం నేతలు పోలు శివ, సబ్బని సమ్మయ్య, గుండా రాజు, బయ్య లింగయ్య, నరేడ్ల కిరణ్, సమ్మయ్య, రాజు, జగదీష్, శ్రీను పాల్గొన్నారు.



శ్రీధర్‌బాబు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నేతలు

ఎన్నికల కోడ్‌తో నిలిచిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- పదుల సంఖ్యలోనే గృహాలకు జీయో ట్యాగ్ అనుమతి

రామగిరి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇందిమ్మ గృహ నిర్మాణాలకు ఎన్నికల కోడ్‌తో గ్రహణం పట్టినట్లైయ్యింది. మండలంలోని లబ్ధిదారులుగా ఎంపికైన గృహాల నిర్మాణాలకు అనుమతి లేక పోవడంతో మిన్నకుంటున్నారు. ఇందిరమ్మ లబ్ధిదారులుగా గుర్తించి ఇరవై రోజుల ముందు గానే అర్హులైన లబ్ధిదారుల జాబితాను విడుదల చేశారు. పలువురి పత్రాలను సైతం అందజేశారు. కాగా స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో గ్రామాల్లో లబ్ధిదా రులు నిర్మాణ పనులు ప్రారంభించడంలో సకాలంలో స్పందించకపోవడంతో ఎన్నికల కోడ్‌తో అమలుతో జీయో ట్యాగ్ అనుమతి పొందలేదు. మండలంలోని అనేకగ్రామాల్లో లబ్దిదారులకు జీయోట్యాగ్ అనుమతి లభించక పనులు ప్రారం భించలేదు. మండలంలోని కల్వచర్లకు 70, సుందిళ్ల 08, జల్లారం 02, చందనాపూర్ 05, బేగంపేట్ 05, ఆదివారంపేట్ 07, నాగేపల్లి 01 చొప్పున 98మంది ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికయ్యారు. కల్వచర్లలో 70మంది లబ్ధిదారుల్లో కేవలం నలుగురికి మాత్రమే జీయోట్యాగ్ అనుమతి లభించగా బేసి మెంట్ లెవల్ పనులు పూర్తి చేసుకు న్నారు. సుందిళ, జల్లారం, చందనాపూర్, ఆదివారంపేట్, బేగంపేట్, నాగేపల్లి గ్రామాల్లో కోడ్ అమలుతో నిర్మాణాలకు బ్రేక్ పడినట్లైయింది. మండలంలోని రత్నాపూర్‌ను పైలెట్ ప్రాజెక్టు ఎంపిక చేయడంతో పనులు శరవేగంగా కొనసా గుతున్నాయి. రత్నాపూర్ మొత్తం 326 గృహాలు మంజూరు కాగా అందులో 121 గృహాలకు ముగ్గు పోసుకున్నారు. 77బేసిమెంట్ లెవల్ వరకు పూర్తిచేశారు. 35రూఫ్‌లెవల్, 31 స్లాబ్ లెవల్ వరకు పూర్తి చేసుకున్నాయి. ఈ ఇళ్ల పూర్తినిర్మాణం జరగాలన్నా, మిగతాఇళ్ల నిర్మాణా లు ప్రారంభం కావాలన్నా స్థానికఎన్నికల సమరం ముగిసే వరకు లబ్ధిదారులు వేచిచూడాల్సిన పరిస్థితి నెలకొంది. సుందిళ్ల, జల్లారం, చంద నాపూర్, ఆదివారంపేట్, నాగేపల్లి, బేగంపేట్ గ్రామాల్లో జీయో ట్యాగ్ అనుమతులు ఉన్నప్పటికీ గృహ నిర్మాణ పనులు జరగడం లేనట్లు తెల్సింది.



రత్నాపూర్‌లో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు

యాక్టింగ్ ప్రాతిపదికన ప్రమోషన్లు ఇవ్వాలి

యైటింక్లయిన్‌కాలనీ, అక్టోబర్ 8 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లుగా ఆర్‌జీ-2 ఓసీపీ-3 సిహెచ్‌పీలో యాక్టింగ్ ప్రాతి పదికన ప్రమోషన్లు అన్ని డిజి గ్నేషన్‌లకు ఇవ్వాలని సింగ రేణి యాజమాన్యాన్ని కోరు తూ బుధవారం ఏఐటీ యూసీ సిహెచ్‌పీ బ్రాంచ్ సహాయకార్యదర్శి గంధం సాం బశివరావు, పిట్‌సెక్రటరీ సెగ్గం శంకర్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు రావాల్సిన టెండాల్ ప్రమోషన్లు ఇవ్వాలని, నాలుగు సంవత్సరాలుగా చాలామంది కార్మి కులు యాక్టింగ్ చేస్తూ ప్రమోషన్ల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఇప్పటికైన యాజ మాన్యం స్పందించి వెంటనే అర్హత ఉన్న కార్మికులకు ప్రమోషన్ ఇవ్వాలని లేనిపక్షంలో కార్మికులతో పెద్దఎత్తున పోరాటాలకు సిద్ధం కావాల్సి ఉంటుందని, అందుకు యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్ర మంలో అల్లి రమేష్, రాజశేఖర్, రాజ్‌కుమార్, బుర్ర రమేష్, గాజుల శ్రీనివాస్, తోట తిరు పతి, నరసింహారెడ్డి, రాయలింగు, ఆంజనే యులు, లాగల రమేష్ కార్మికులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆర్‌జీ-1 ఏరియాను సందర్శించిన రైల్వే ఉన్నతాధికారులు

గోదావరిఖని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియాను బుధవారం సెంట్రల్‌కోల్ మినిస్ట్రీకి సంబధించిన రైల్వే ఉన్నతాధికారులు సందర్శించారు. సౌత్‌సెంట్రల్ రైల్వే పీసీసీఎం పాండే, సీనియర్ డీసీఎం శిపాలికుమారి, రామ గుండం ఏవో అక్షయ్ పాటి, రామగుండం సీఐ దేవేందర్, ఎస్‌ఎంఆర్ మునిరం మీనా.. జీడీకే వన్ సీఎస్‌ని సందర్శించారు. వీరికి ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఎస్‌పీలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాద కత, బొగ్గురవాణా వివరాలను అడిగి తెలుసుకు న్నారు. కంట్రోల్‌రూమ్‌లో వ్యాగన్ లోడింగ్ సిస్టం, వ్యాగన్ వేబ్రిడ్జి, పనిప్రదేశాలను తనిఖీ చేసి ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేసుకుంటూ బ్రేక్ డౌన్‌లు జరగకుండా చూడాలని సూచించారు. జీడీకే ఓసీపీ-5గనికి సంబంధించిన వ్యూపాయింట్ వద్ద మ్యాప్ లను పరిశీలించారు. డంప్‌యార్డు, క్వారీలను పరిశీలిం చారు బొగ్గుతీసే క్రమంలో రక్షణపట్ల తీసుకోవాల్సిన చర్యల గురించి, యంత్రాల పనితీరు గురించి అడిగి తెలు సుకున్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రాంమో హన్, ఓసీపీ-5 ప్రాజెక్టు ఆఫీసర్ రమేష్, డీజీఎం(ఫారెస్ట్) కర్ణ, మేనేజర్ అనిల్ గబాలే, సర్వే అధికారి చంద్ర మౌళి, సెక్యూరిటీ అధికారి వీరారెడ్డి పాల్గొన్నారు.



ఓసీపీ-5ని వ్యూ పాయింట్ ద్వారా పరిశీలిస్తున్న రైల్వే ఉన్నతాధికారులు



6 నెలల పాటు సింగరేణిలో సమ్మెలు నిషేధం

- తెలంగాణ ఎస్మా కింద నోటిఫికేషన్

హైదరాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో సమ్మెలను నిషేధిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ ఎస్మా-1971 కింద నోటిఫికేషన్ ఇస్తూ ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్ బుధవారం జీవో జారీచేశారు.

ఈ నిషేధం గతసెప్టెంబరు 11వ తేదీ నుంచి అమలులోకి వచ్చింది. నిషేధం 6నెలల పాటు అమలులో ఉండనుంది.

వోల్వో, డంప్ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సింగ రేణి ఆర్జీ-2 ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత వోల్వో, డంప్ ట్రక్ ఆపరేటర్ శిక్షణకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జీఎం బండి వెంకటయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన హెవీ గూడ్స్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండి మూడేళ్ళ డ్రైంగ్ అనుభవం ఉన్నవారు అర్హులని తెలిపారు. ఆర్జీ-1 టీటీసీలో 12 రోజుల పాటు థియరీ, ప్రాక్టికల్ శిక్షణ ఉంటుందని జీఎం తెలిపారు. పరిసర, ప్రభావిత గ్రామాల యువకులు, సింగరేణి ఉద్యోగులు, మాజీ ఉద్యో గుల పిల్లల ఉద్యోగఅవకాశాలు మెరుగుపరుచుకునేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆర్జీ-2 ఎంవీటీసీ శిక్షణాకేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని జీఎం సూచించారు.

ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఎదుట.. కాంట్రాక్టు కార్మికుల ధర్నా

రామగిరి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా చెల్లింపుపై నిర్లక్ష్యంగా వ్యహరించడాన్ని నిరసిస్తూ బుధవారం ఆర్జీ-3జీఎం కార్యాలయం ఎదుట ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. యాజ మాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. అనంతరం ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావుకు కాంట్రాక్టు కార్మికులు వినతిపత్రం అందజేశారు. ధర్నాలో నాయకులు ఆకులవెంకన్న, మొండయ్య, రాజనర్సు, ఓదెలు, సంపత్, అజయ్, విజయ, రాధ తదితరులు పాల్గొన్నారు.



కాంట్రాక్టు కార్మికుల వినతి పత్రం అందుకుంటున్న జీఎం

ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించిన జీఎం

గోదావరిఖని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఏడాది అందించే మెరిట్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెక్‌లను బుధవారం జీఎం కార్యాలయంలో ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ విద్యార్థులకు అందించారు. ఈసందర్భంగా జీఎం మాట్లాడుతూ ఫీజు రీయింబర్స్ క్రింద ప్రతిసంవ త్సరం చదువు పూర్తి అయ్యేంత వరకు రూ.16వేల చెక్‌లను అందిస్తామని తెలిపారు. సింగరేణిలో పని చేస్తున్న ఉద్యోగుల, అధికారుల పిల్లలు ఉన్న తచదువులలో రాణించేందుకు కృషిచేస్తున్న వారి తల్లిదండ్రులను అభినందించారు. కార్యక్ర మంలో ఏఐటీయూసీ రాజు, ఏజెంట్ చిలుక శ్రీనివాస్, ఏజీఎం ఐఈడీ అంజనేయులు, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, డీవైపీఎం వేణు, సీనియర్ పీఓలు శ్రావణ్‌కుమార్, హన్మంతరావు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ తనిఖీ



అంబులెన్స్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా అధికారి కుమారస్వామి

మంథని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాతాశిశు సంరక్షణ కేంద్రం ఆవరణలో జిల్లా 108 అంబులెన్స్ అధికారి కుమారస్వామి స్థానిక 108అంబులెన్స్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొద్ది నెలలుగా డివిజన్‌లో అందిస్తున్నసేవలు, అత్యవసర సమ యాల్లో వినియోగించే పరికరాల పనితీరు, మందులు, పలు రికార్డు లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. 24గంటలు అంబులెన్స్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అత్యవసర సమయాల్లో ఆసుపత్రికి తరలించాలని సూచించారు. కార్యక్రమంలో 108సిబ్బంది ఈఎంటీ నిమ్మతి శ్రీనివాస్, పైలట్ హబీబ్ అహ్మద్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు గాయత్రి విద్యానికేతన్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న అల్లెంకి శ్రీనివాస్

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా నెట్‌బాల్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో ఈనెల 7న జరిగిన జూనియర్ నెట్‌బాల్ పోటీల్లో గాయత్రివిద్యానికేతన్ విద్యార్థులు తనీష్, సాయిచరణ్‌రెడ్డి, జశ్వంత్‌రావు సత్తాచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వారు ఈ నెల9, 10తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన నున్నట్లు విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. ఈసంద ర్భంగా వారిని పుష్పగుచ్చాలు అందించి అభినందిం చారు. కార్యక్ర మంలో కరస్పాండెంట్ అల్లెంకి రజని, ప్రిన్సిపాల్ విజయ్, వ్యాయామ ఉపాధ్యాయులు అజయ్, మంజుల అభినందించారు.

మూసివేసిన మురికి కాలువను శుభ్రం చేయించిన అధికారులు

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకు రాయి గ్రామంలో ఓ ఇంటి యజమాని తన ఇంటిముందు నిర్మించిన మురికి కాలువ గుండా మురుగునీరు ప్రవహిస్తుందని మూసివేశాడు. దీంతో స్థానికులు పంచాయతీకార్యదర్శికి ఫిర్యాదు చేశారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి శంకరయ్య సిబ్బందితో కాలువలో వేసిన మట్టిని తీయించి మురికికాలువను శుభ్రం చేయించారు.

మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన

సుల్తానాబాద్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్యాలయంలో ఉమెన్‌అండ్‌చైల్డ్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలతో కలిగే దుష్ప్రభావాలపై వివరించారు. వీటి నివారించడానికి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రమేష్, మున్సిపల్ మేనేజర్ అలీమోద్దిన్, మున్సిపల్ సిబ్బంది, ఉమెన్‌అండ్ చైల్డ్ వెల్ఫేర్ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్క కాటుకు గురైన పశువులకు టీకాలు వేయించాలి

ఎలిగేడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 12గ్రామాల్లో ఉన్న పశువులకు కుక్కకాటుకు సంబంధించిన టీకాలు అందుబాటులో ఉన్నా యని మండల పశువైద్యాధికారి ఝాన్సీ తెలిపారు. గ్రామాల్లో కుక్కకాటు కు గురైన పశువుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా వెంటనే టీకాలు వేయించాలని పేర్కొన్నారు. టీకాలు వేయకుంటే పశువులకు రేబిస్ సోకి మృతి చెందే ప్రమాదం ఉందన్నారు.

14, 15న మున్సిపల్ వర్కర్స్ రాష్ట్ర మహాసభలు

మంథని, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూకు అనుబంధంగా ఉన్న మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ రాష్ట్ర మహా సభలను ఈనెల 14, 15వతేదీల్లో రంగారెడ్డి జిల్లా తుర్కయంజాల్‌లో నిర్వహిస్తు న్నట్లు సీఐ టీయూ జిల్లాకార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు తెలిపారు. బుధవారం ఆయన మున్సిపల్ వర్కర్స్‌ను కలిసి రాష్ట్ర మహా సభలను విజయ వంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో నేతలు బూడిద గణేష్, చందు మల్లేష్, గట్టయ్య, బాగ్య, పోచమ్మ పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

జ్యోతినగర్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ కాంట్రాక్టు కార్మి కుడు సిరిశెట్టి శ్రీకాంత్ మృతిచెందగా ఆయన కుటుంబానికి బుధవారం కాంట్రాక్టు కార్మిక సంఘాల ఐక్యవేదిక, కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియే షన్ ఆధ్వర్యంలో నష్టపరిహారం అందజేశారు. శ్రీకాంత్ మృతి చెందిన సమయంలో కుదిరిన ఒప్పందం మేరకు రూ.35వేల నష్టపరి హారం అందజేయగా, మిగిలిన రూ.4లక్షల చెక్కును అతని కుటుంబ సభ్యు లకు అందించారు. టీటీఎస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ కార్యాల యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేఏసీనాయకులు నాంసాని శంకర్, చిలుక శంకర్, భూమయ్య, రాజమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో ఉచిత వైద్యం శిబిరం

రామగిరి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఉచిత వైద్యంశిబిరం బుధవారం నిర్వహించారు. కరీంన గర్‌కు ఫార్చ్యున్ మెడికేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి ఉద్యోగులు, విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని కళాశాల ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్ ప్రారంభించారు. ప్రిన్స్ పాల్, వైస్‌ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కుమార్ వైద్యపరీక్షలు చేయించుకున్నారు. వైద్య శిబిరంలో బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఇకో, వైద్యపరీక్షలను చేశారు. సుమారు 192మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సీఈవో శంకర్‌ప్రసాద్‌రెడ్డి, వైద్యులు పుల్లారావు, ఆకృతి, దీప్తి రెడ్డి, మేనేజర్ గణేష్, వైద్యసిబ్బంది, కళాశాల పరిపాలనాధికారి సుమన్ రెడ్డి, డిస్పెన్సరీ ఇన్‌చార్జి రమేశ్, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వైద్య పరీక్ష చేయించుకుంటున్న ప్రిన్స్‌పాల్